రాజ్యాంగం అమలుతోనే బడుగుల అభ్యున్నతి

- ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం
- అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: రాజ్యాంగం వల్లే దేశంలోని బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సమానత్వం లభించిందని, దేశం ఉన్నతిలో ప్రధానభూమిక పోషిస్తోందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. పట్టణంలో ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డు బస్టాండ్ దగ్గర ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు, మంత్రి పదవులు కేటాయించారన్నారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించడం, రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించడం మన అదృష్టం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అలుగు ఆనంద శేఖర్, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, చిటికెల అచ్యుతరామయ్య, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్ సచివాలయ కన్వీనర్ చలమల శ్రీనివాస్, చిన్న తిరుపతి దేవస్థానం డైరెక్టర్ వాసా రామకృష్ణ కటారి రాంబాబు, కౌన్సిలర్ నేకూరి కిషోర్, సంకు సురేష్, ఎల్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలు ఉన్నత శిఖరాలకు

టి.నర్సాపురం: భారత రాజ్యాంగం వల్లనే అట్టడుగు వర్గాల వారు ఉన్నత శిఖరాలకు ఎదగలిగారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బొర్రంపాలెంలో ఆదివారం ఎమ్మెల్యే బాలరాజు, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని, రాజ్యాంగం పుస్తకాన్ని స్థానిక యువత పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజులకు అందించారు. కార్యక్రమంలో విజయ్, తోట గంగాధరరావు, పల్లారమేష్, కొనకళ్ల సర్వేశ్వరరావు, నల్లమిల్లి శీను, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

కొయ్యలగూడెం: దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు అనే సిద్ధాంతంతో భారత రాజ్యాంగాన్ని రూపొందించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలోని దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కొయ్యలగూడెం లోని కొవ్వూరు రోడ్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి నివాళులు అర్పించారు. లైబ్రరీలో లైబ్రేరియన్ యు.రాముడు అంబేడ్కర్ చిత్రపటానికి విద్యార్థులతో పూలమాలలు వేయించి నివాళులు అర్పించారు. పరింపూడి అంబేడ్కర్ విగ్రహం వద్ద టౌన్ కన్వీనర్ సంకు కొండ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ గంజిమాల రామారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిద్దె సూర్యచంద్రం, రొక్కాల నాగరాజు, ఏలేటి భాస్కర్, మారిశెట్టి శ్రీను, బొబ్బర చిట్టియేసు, పూలపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 74వ ప్రగతిశీల ప్రజాస్వామిక రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌స మీపంలోని బుద్ధుడు, పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు వివిధ సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజావైద్యశాల కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. డాక్టర్ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశేష కృషిచేశారన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ కె.స్లీవజోజి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి

పోలవరం రూరల్: అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ అన్నారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అడుగుజాడల్లో యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఫాతిమున్నీసా, పంచాయతీ ఉప సర్పంచ్ కోరసిక శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు పాడుం శ్యాం కుమార్, సిగ్గన వెంకటరత్నం, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామవరపుకోట: మండలంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బి.రాములు అధ్యక్షతన, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన అంబేడ్కర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి సాయిన కనకరాజు రాజ్యాంగ ప్రాముఖ్యత గూర్చి వివరించారు. ఈ సందర్భంగా చదువుతో పాటు క్రీడలలో రాణిస్తున్న బీఏ విద్యార్థి బి.సారికను అభినందిస్తూ సాయిన కనకరాజు రూ.5,300 ప్రోత్సాహక నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ధారావతు మల్లేష్, అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, వి.శ్రీనివాస్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, బి.రాజు, కుమార్ రాజా పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



టి.నర్సాపురం: బొర్రంపాలెంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని పోలవరం ఎమ్మెల్యే బాలరాజుకు బహూకరిస్తున్న స్థానిక యువత

రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్‌కు నివాళి

చింతలపూడి: దేశంలో ఎన్ని కులాలు, మతాలు ఉన్నా ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో బతుకుతున్నారంటే అది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లేనని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. చింతలపూడిలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత నాయకులు, ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భిన్న సంస్కృతులు ,భాషలు, ప్రాంతాలు, మతాల కలయిక అయిన భారతదేశానికి రాజ్యాంగం రూపొందించడం సవాల్ వంటిదన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్య శాలను ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్‌వీ రామారావు, కె శివరామకృష్ణ, బి వెంకట్రావు, వెంపా కృష్ణ, అంబేడ్కర్ వాది కలకుర్తి నాగేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే ఆజాద్‌బాబు, ఎయిమ్స్ నాయకులు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే షకీలున్నీసా బేగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బోయగూడెం, పాత చింతలపూడి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, రేచర్ల, రాఘవాపురం, ప్రగడవరం తదితర గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.



చింతలపూడి: రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏఎంసీ చైర్‌పర్సన్ జానకిరెడ్డి



కొయ్యలగూడెం: దిప్పకాయలపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు



జంగారెడ్డిగూడెం: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



పోలవరం: గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



కామవరపుకోట: రావికంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి విరాళం



రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: లింగపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకోదండరామాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, బెంగుళూరు బిల్డర్ భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) రూ.5,00,016 విరాళంగా అందజేశారు. చెక్కును కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ తనవంతుగా గ్రామాలలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా పడిపూజ



రాజవరంలో మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో శనివారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వామి శ్రీరామవీర ధర్మాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 500 మందికి పైగా మాల ధారణ భక్తులు పాల్గొన్నారు. దీక్షలో ఉన్న వారు మండల దీక్ష సమయంలో, శబరిమల యాత్రలో పాటించాల్సిన నియమాల గురించి గురుస్వామి వివరించారు. మహా పడిపూజ కార్యక్రమ ప్రాముఖ్యత పదునెట్టాంబడి విశిష్టతను తెలియపరిచారు. స్వామివారికి పంచామృత అభిషేకాలతో పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.

ఎస్ఈబీ దాడులు



ఎస్ఈబీ దాడుల్లో పట్టుబడ్డ సారా, బెల్లం ఊటతో అధికారులు

చింతలపూడి: చింతలపూడి ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం గ్రామంలో 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదే విధంగా లింగపాలెం మండలంలో 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఈబీ సీఐ సుంకర సాయి స్వరూప్, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

శివలింగాలకు అభిషేకం

కొయ్యలగూడెం: కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ మీనాక్షి సుందరేశ్వర స్వామి ఆలయంలో 1108 పార్థివ శివలింగాలకు ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని శివయ్యకు పూజలు నిర్వహించారు.



1108 పార్థివ శివలింగాలతో శివలింగాకృతి

వైభవం.. జ్వాలాతోరణం



ద్వారకాతిరుమలలో జ్వాలాతోరణ వేడుక

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి జ్వాలాతోరణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వరిగడ్డితో తయారుచేసిన తోరణాన్ని వెలిగించి, దాని కింద నుంచి శివదేవుని వాహనాన్ని ప్రదక్షిణలు చేయించారు. భక్తుల శివనామస్మరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద ఘోషల నడుమ ఈ ఉత్సవం అట్టహాసంగా జరిగింది. వేడుక అనంతరం గంగా, పార్వతీ సమేత శివదేవుడు గజ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఈ వేడుకలో ఆలయ ఏఈఓలు ఆర్.లక్ష్మణ స్వామి, పి.నటరాజారావు, సూపరింటెండెంట్ రమణరాజు తదితరులున్నారు.

కుక్కునూరు: కుక్కునూరులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, పెద్దరావిగూడెం కేదారేశ్వరస్వామి ఆలయాలలో స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు, జ్వాలాతోరణం కార్యక్రమాన్ని వేడకగా నిర్వహించారు.



కుక్కునూరులో నిర్వహిస్తున్న జ్వాలాతోరణం

దేశ సమైక్యత పెంపొందించేందుకు కృషి

చింతలపూడి: దేశ సమైక్యత, నైతిక విలువలు పెంపొందించేందుకు జమాతే ఇస్లామిక్ హింద్ సంస్థ పాటుపడుతున్నట్లు జమాతే ఇస్లామిక్ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ అన్నారు. స్థానిక షాదీఖానాలో జమాతే ఇస్లామిక్ హింద్ కార్యవర్గ సభ్యుల శిక్షణ కార్యక్రమం జామియ మస్జిద్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రఫీక్ మాట్లాడుతూ జమాతే ఇస్లామి హింద్ వచ్చే నాలుగేళ్లలో చేపట్టే కార్యక్రమాలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఏడు దశాబ్దాలుగా దేశంలో మత సామరస్యం కోసం, హిందూ, ముస్లిం, క్రిస్టియన్, ఇతర మతాలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముస్లిం యువత విద్యావంతులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ కరీముద్దీన్, జిల్లా అధక్షుడు ముజాహిద్, వరంగల్ జమాత్ నాయకులు మౌలానా పాష ఆలం, రియాజ్ ఫలాహి, చింతలపూడి శాఖ అధక్షుడు షేక్ హుస్సేన్, జామియ మస్జిద్ అధక్షుడు సయ్యద్ రహీం, ప్రధాన కార్యదర్శి ఎండీ జిలాని, ఎండీ అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్

మఠంగూడెంలో సెమీక్రిస్మస్ వేడుకలు

లింగపాలెం: ఏసుక్రీస్తు భోదనలు అనుసరణీయమని, మానవాళి ఆయన అడుగుజాడల్లో నడవాలని బిషప్ టి జార్జికోర్నేలియస్ అన్నారు. మఠంగూడెం సీఎస్ఐ దేవాలయం ఆవరణలో సంఘకాపరి బందెల ఆనంద రావు శామ్యూల్ ఆధ్వర్యంలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిషప్ చేతుల మీదగా క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. ఈసందర్భంగా బిషప్ జార్జికోర్నేలియస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీస్తుమార్గంలో నడవాలని పేర్కొన్నారు. క్రీస్తు జననం గురించి వివరించారు. ఈసందర్భంగా వృద్ధులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం బిషప్ జార్జికోర్నేలియస్, జాషువా కుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, వాహనాల తనిఖీ అధికారి కె.విజయరాజు, రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, పాస్టర్లు, ఫాదర్లు, డయెసెస్ కార్యవర్గం జె.రవికుమార్, టీడీ సుధాకర్, అలెగ్జాండర్, సు. దీర్ దత్తు, పండు జగదీష్, టీవీఎస్ ప్రసాద్, బి.ఆనందరావు శామ్యూల్, విశ్వాసులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బిషప్ జార్జికోర్నేలియస్

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం పోలవరం కుడికాలువ గట్టు వద్ద డబ్బులు పణంగా పెట్టి జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,400 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

ద్వారకాతిరుమల: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం పాటుపడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని చినవెంకన్న దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు కోరారు. మండలంలోని సత్తెన్నగూడెంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అందులో పాల్గొన్న సుబ్బారావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వాటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లనిచ్చిన మామతో పాటు, ఓటు వేసిన ప్రజలను వంచించిన ఘనాపాటి చంద్రబాబు అని అన్నారు. మనల్ని పాలించేవాడు మంచివాడా? ముంచేవాడా? అని ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన అంటే ఎన్నో సంక్షేమ పథకాలు గుర్తుకొస్తాయన్నారు. తండ్రి బాటలోనే జగనన్న ప్రజా సంక్షేమం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచనలతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో 610 హామీలిచ్చి, ఒక్కటికూడా అమలు చేయకుండా ప్రజలను వంచించాడన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకునే వ్యక్తి కావాలా? మాయమాటలతో మోసగించే వ్యక్తి కావాలా? ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మానుకొండ వెంకటరమణారావు, పెండెం నాగరాజు, మానుకొండ నాగేశ్వరరావు, పెనుమాక మునియ్య తదితరులున్నారు.



సత్తెన్నగూడెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న సుబ్బారావు, తదితరులు

నేత్రపర్వం.. సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమద్ కల్యాణాన్ని తిలకించి తరించారు. స్వామివారిని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఎమ్మెల్యేకి ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, టి.నర్సాపురం జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా భక్త గానామృతం సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు.



కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవారు

సీఐటీయూ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

కొయ్యలగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాలు, పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు కోరారు. ఈమేరకు ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు, కె.సతీష్, పి.శ్రీను, బి.వెంకన్న, డి.సత్తిబాబు, ఈ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్పోర్ట్స్ కిట్‌ల పంపిణీ

కొయ్యలగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో యువతకు ఆదివారం తపన ఫౌండేషన్ ఆర్గనైజర్ ఆరేటి ఏసుబాబు ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కొయ్యలగూడెం, పరింపూడి, సరిపల్లి గ్రామాలలోని క్రీడాకారులకు ఇరవై వేల రూపాయల విలువైన కిట్లు అందజేశారు. సంస్థ మీడియా కోఆర్డినేటర్ ప్రసాద్, బీజేపీ ప్రధాన కార్యదర్శి కట్టా సత్యనారాయణ, ఆలపాటి భాస్కర్, బొమ్మ బాబు, తవ్వ గోపాల్ పాల్గొన్నారు.

విర్డ్‌లో శస్త్రచికిత్సలు విజయవంతం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 24, 25 తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అందులో ప్రముఖ అంతర్జాతీయ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్ 30 మంది రోగులను పరీక్షించి, 8 మందికి విజయవంతంగా శస్త్రచికిత్సలు చేశారు. డిసెంబర్ మూడవ వారంలో డాక్టర్ భాస్కరానంద్ కుమార్‌చే మళ్లీ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తామని ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. పోలియోతో పాటు, అన్ని రకాల చేతి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు, వివరాల కోసం సెల్ 85002 63149కు సంప్రదించాలని చైర్మన్ కోరారు.

మహాదేవా.. శంభో శంకరా

పోలవరం రూరల్: కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పవిత్ర గోదావరిలో స్నానమాచరించి శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఉపవాసం ఉన్న భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రం వద్ద శివనామస్మరణతో గడిపారు. క్షేత్రపాలకుడైన భావన నారాయణ స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎస్.సంగమేశ్వరశర్మ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. పోలవరం సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ర్పాటు చేశారు.

గోదావరి మాతకు హారతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టిసం రేవులో శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి, గోదావరి మాతకు దేవస్థానం అర్చకులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గోదావరి హారతి సమర్పించారు. అనంతరం గ్రామంలో జ్వాలాతోరణం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: కార్తీక పౌర్ణమిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని బైనేరు వద్ద ఉన్న శివాలయం, పంగిడిగూడెం రోడ్డులోని శివాలయం, హైస్కూల్ వద్ద ఉన్న శివాలయంతో పాటు గుహాలయంలో ప్రత్యేక అభిషేకాధి పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే దాన కార్యక్రమాలు నిర్వహించారు.

బుట్టాయగూడెం: కార్తీక పౌర్ణమికి శివాలయాల్లో ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్థానిక శివాలయంలో, రెడ్డిగణపవరం శివాలయంతోపాటు పలు శివాలయాల్లో 365 ఒత్తులు వెలిగించి పూజా కార్యక్రమాలు చేశారు.



విశేషాలంకరణలో పట్టిసం క్షేత్రంలోని వీరేశ్వరస్వామి



రెడ్డిగణపవరం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ధర్మాజీగూడెంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు



పట్టిసం రేవులో గోదావరి మాతకు హారతి సమర్పిస్తున్న అర్చకులు

ధర్మాజీగూడెంలో ప్రత్యేక పూజలు

లింగపాలెం: ధర్మాజీగూడెంలోని శ్రీధర్మలింగేశ్వరస్వామి శివాలయాన్ని ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు సాయంత్రం 5.30 గంటల నుంచి దీపారాధనలు చేశారు. నందీశ్వరుడుకి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అయిలూరి ఈశ్వరప్రసాద్ పూజలు నిర్వహించారు.